సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 2 । జనవరి । 2025





అభిషేక ప్రియనే శరణమయ్యప్ప

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్వామియే శరణమయ్యప్ప.. అభిషేక ప్రియనే శరణమయ్యప్ప.. నామస్మరణతో ఎల్లారెడ్డిపేట మార్మోగింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి పురవీధుల్లో అయ్యప్ప శోభాయాత్ర నిర్వహించారు. దారిపొడవున మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం ఆభరణాలు ఊరేగించారు. రాజు, శ్రీను గురుస్వాముల ఆధ్వర్యంలో మహాపడి పూజను సరుగు సాయికుమార్ దంపతులు నిర్వహించారు. బొమ్మకంటి జ్యోతి-భాస్కర్ దంపతులు నూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు 5వేల లడ్డూలు, అన్నదానం పంపిణీ చేశారు. గురుస్వాములు చకిలం మధు, గోపాల్‌రెడ్డి, కందుకూరి రవి, కొల బాపురెడ్డి, నంది నరేశ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

- ఎస్పీ అఖిల్ మహాజన్
- చందుర్తి ఠాణా తనిఖీ



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

చందుర్తి(వేములవాడ): రౌడీషీటర్ల కదలికపై నిఘా పెట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది విధులపై ఆరా తీశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సిబ్బందికి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డయల్ 100 కాల్స్‌కు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది తక్షణమే స్పందించాలని కోరారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య తదితరుల ఉన్నారు.

130 మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై రమాకాంత్

సిరిసిల్లక్రైం/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్(సిరిసిల్ల): నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జిల్లా ప్రజలు డిసెంబర్ 31వ తేదీన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మద్యంబాబులు అయితే తెగ తాగేశారు. అయితే మద్యం తాగిన తర్వాత వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడ్డారు. ఇలా డ్రంకెన్ డ్రైవ్ చేసిన వారిని పట్టుకొని జిల్లా వ్యాప్తంగా 130 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు.

అర్ధరాత్రి వరకు తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి దాటినా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను పోలీసులు కొనసాగించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా విడిపోయి గొల్లపల్లి, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేటలోని రెండు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఎస్సై రమాకాంత్ పెట్రోలింగ్ చేశారు. ముస్తాబాద్ మండలంలో 20 మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. అవునూర్, పోతుగల్, నామాపూర్, గూడెం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు.

మానేరు చివరి ఆయకట్టుకు నీరందిస్తాం

- ఇరిగేషన్ డీఈఈ రవికుమార్



కెనాల్‌ను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మానేరు ప్రాజెక్టు తైబందీ తీర్మానం మేరకు చివరి ఆయకట్టుకు నీరందిస్తామని నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్ తెలిపారు. గూడూరు నుంచి ముస్తాబాద్, తెర్లుమద్ది వరకు మానేరుకెనాల్‌లో ఉన్న చెత్త, గుర్రపుడెక్క, తుంగను బుధవారం జేసీబీతో తొలగించారు. డీఈఈ మాట్లాడుతూ ప్రాజెక్టులో నీరున్నా కెనాల్స్ సరిగ్గా లేకపోవడంతో నీటి ప్రవాహం తగ్గిందన్నారు. రైతుల కోరిక మేరకు కెనాల్స్‌ను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. తైబందీ తీర్మానం మేరకు నీటి విడుదల కొనసాగుతుందని, రైతులు సహకరించాలని కోరారు. వారానికి రెండు సార్లు తెర్లుమద్దికి సాగునీటిని విడుదల చేస్తామన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, లష్కర్లు పాల్గొన్నారు.

అనంతారం చెరువులోకి నీరు వదలండి

ఇల్లంతకుంట(మానకొండూర్): అనంతారం చెరువులోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ జంగారెడ్డిపల్లి కాంగ్రెస్ నాయకులు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విన్నవించారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ఎమ్మెల్యేను బుధవారం శనిగరం స్టేజీ వద్ద కలిశారు. అనంతగిరి జలాశయం నుంచి నీటిని వదిలి అనంతారం ప్రాజెక్టును నింపాలని కోరారు. నాయకులు మంద బాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగ తాగేశారు





- జోరుగా సాగిన మద్యం, కేక్‌లు, బిర్యానీ అమ్మకాలు
- కరీంనగర్‌లో ఒక్కరోజులోనే రూ.30 కోట్ల లిక్కర్ విక్రయాలు
- రూ.7 కోట్ల కేకులు, రూ.11 కోట్ల బిర్యానీ సేల్స్
- ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ టాప్
- జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలోనూ ఇదే తీరు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో నయా'సాల్' జోష్.. ఫుల్లుగా కనిపించింది. కొత్త సంవత్సరం వేడుకల కోసం డిసెంబరు 31న పాత జిల్లాలో రూ.కోట్లాది కొనుగోళ్లు జరిగాయి. ముఖ్యంగా లిక్కర్, కేకులు, బిర్యానీలు ఈ కొనుగోళ్లలో అగ్రభాగాన నిలిచాయి. అందులోనూ లిక్కర్ విక్రయాలు సింహభాగం దక్కించుకున్నాయి. కరీంనగర్ జిల్లా రూ.30 కోట్ల విక్రయాలతో ఉమ్మడి జిల్లాలో టాప్‌లో నిలిచింది. జగిత్యాల జిల్లాలో మంగళవారం ఒక్కరోజు రూ.4.42 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. సిరిసిల్ల జిల్లాలో రూ.4.36 కోట్ల మద్యం అమ్ముడుపోయింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అమ్మకాలు తక్కువగా నమోదయ్యాయి. కరీంనగర్‌లో గత డిసెంబర్‌లో రూ.133.78 కోట్ల బిజినెస్ జరగగా.. ఈ ఏడాది రూ.126.30 కోట్లకు పరిమితమైంది. జగిత్యాలలో గతేడాది రూ.81.10 కోట్ల విక్రయాలు జరగగా.. ఈ ఏడాది రూ.73 కోట్ల వద్ద నిలిచిపోయింది.

బేకరీలు, రెస్టారెంట్లు కళకళ

కొత్త సంవత్సరం అనగానే అందరికీ ముందుగా కేకులే గుర్తొస్తాయి. యువత, చిన్నా, పెద్దా తేడా లేకుండా అంతా కేకులు కోసి పండగ చేసుకుంటారు. ఇలా ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బేకరీలన్నీ కేకుల విక్రయాలతో కిటకిటలాడాయి. అన్ని ముఖ్యకూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఆఫర్లతో హాట్, కూల్ కేకులన్నీ అమ్ముడుపోయాయి.

సెకన్‌కు 2 కేకులు, 6 బిర్యానీలు

కరీంనగర్ జిల్లా కేకులు, బిర్యానీల విషయంలో పాత జిల్లాలోనే టాప్‌లో నిలిచింది. మొత్తంగా 2 లక్షలకుపైగా కేకులతో 24 గంటల్లో సెకనుకు 2 కేకుల చొప్పున అమ్ముడయ్యాయి. ఈ బిజినెస్ రూ.6కోట్ల వరకు ఉంటుంది. బిర్యానీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఏకంగా 5.50 లక్షల బిర్యానీలు అమ్ముడుపోయి రూ.11 కోట్ల బిజినెస్ అయ్యింది. ఈ లెక్కన సెకనుకు 6 బిర్యానీల విక్రయాల జరిగి సరికొత్త రికార్డు నెలకొల్పాయని వ్యాపారులు తెలిపారు. నేరుగా కొనేవారితోపాటు స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఆర్డర్లతో రెస్టారెంట్లు, హోటళ్లు కళకళలాడాయి. కర్రీతో పని ఉండదు. ఎక్కడైనా తినే వీలుండటంతో యువతతోపాటు అన్ని వర్గాలవారు బిర్యానీ తినేందుకు మొగ్గు చూపారు. పైగా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడంతో లోకేషన్ పెట్టిన చోటకు వచ్చి మరీ డెలివరీ చేసే సదుపాయం రావడంతో ఎక్కువ మంది బిర్యానీ తినేందుకు ఇష్టపడ్డారు.

ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు ఇలా

జిల్లా	మద్యం అమ్మకాలు
కరీంనగర్	రూ.30 కోట్లు
జగిత్యాల	రూ.4.42 కోట్లు
సిరిసిల్ల	రూ.4.36 కోట్లు
పెద్దపల్లి	రూ.3.50 కోట్లు

కేక్‌లు

జిల్లా	కేకులు	బిజినెస్
కరీంనగర్	రెండు లక్షలు	రూ.6కోట్లు
జగిత్యాల	15వేలు	రూ.30లక్షలు
పెద్దపల్లి	30వేలు	రూ.60లక్షలు
సిరిసిల్ల	20వేలు	రూ.40లక్షలు

బిర్యానీలు

జిల్లా	బిర్యానీ	బిజినెస్ (సుమారు)
కరీంనగర్	5.50లక్షలు	రూ.11కోట్లు
జగిత్యాల	8000	రూ.24లక్షలు
పెద్దపల్లి	12,500	రూ.31.25లక్షలు
సిరిసిల్ల	10వేలు	రూ.25లక్షలు

(గమనిక : ఇందులో కేవలం ప్రముఖ హోటళ్ల నుంచి సరాసరి వివరాలు మాత్రమే. సంఖ్యల్లో మార్పు ఉండొచ్చు.)

సెలవులకే సెలవు !

- ఒక్క రోజు కూడా గైర్హాజరుకాని మాస్టారు
- ఆదర్శంగా నిలుస్తున్న సిరిసిల్ల హెచ్‌ఎం శ్రీనివాస్
- నెటిజన్ల ప్రశంసల వర్షం



శ్రీనివాస్



ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులతో శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు

సిరిసిల్లకల్చరల్: విద్యార్థుల భవిష్యత్.. స్కూల్ బాగు కోసం ఆ ఉపాధ్యాయుడు కర్తవ్యదీక్షకు నెటిజన్లు సలాం కొడుతున్నారు. 2024వ సంవత్సరంలో ఒక్క సెలవు కూడా తీసుకోకుండా నిత్యం స్కూల్ వచ్చారు సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్. 2023లో ఒక్క రోజు మాత్రమే సెలవు పెట్టారు. సాధారణంగా ఉద్యోగులకు వేతనంలో కోత లేకుండా 15 సెలవులు వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ ఆ సెలవులను సైతం హెచ్‌ఎం శ్రీనివాస్ ఉపయోగించుకోలేదు. ఈ విషయాన్ని తనే సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో నెటిజన్ల నుంచి అభినందనల వర్షం కురుస్తోంది.

విద్యార్థుల సంఖ్య పెరగడంలో..

2009లో ప్రస్తుతం పనిచేస్తున్న శివనగర్ స్కూల్‌లోనే ఎఫ్‌ఏసీ హెడ్‌మాస్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లారు. ఆ సమయంలో ఆ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 500 ఉండేది. మళ్లీ 2018లో హెడ్‌మాస్టర్ అదే పాఠశాలకు వచ్చారు. కానీ ఆ పాఠశాలలో శ్రీనివాస్ వెళ్లే సమయంలో 500 మంది ఉండగా.. తిరిగొచ్చే నాటికి 50 మాత్రమే మిగిలారు. దీన్ని చాలెంజ్‌గా తీసుకున్న శ్రీనివాస్.. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విశేష కృషి చేశారు. ప్రస్తుతం శివనగర్ ఉన్నత పాఠశాలలో 301 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు.. మొదట ఉపాధ్యాయులు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. నిర్దేశిత టైమ్‌టేబుల్ ప్రకారం సబ్జెక్టుల బోధన, సిలబస్ పూర్తిచేయడం, బడికి వస్తున్న పిల్లల అభ్యసన స్థాయి పెంచడం వంటి వాటిలో విజయవంతమయ్యారు. వేసవిసెలవుల్లోనూ ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీల్లో విద్యార్థులను ప్రోత్సహించి మంచి ఫలితా లు సాధించారు. దీంతో తల్లిదండ్రులకు స్కూ ల్‌పైన, ఉపాధ్యాయులపైన విశ్వాసం పెరిగింది. విద్యార్థుల సంఖ్య 301 మందికి చేరారు. పాఠశాల పురోగతికి కృషిచేసిన శ్రీనివాస్‌ను రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించి ప్రభుత్వం పురస్కారాన్ని ప్రదానం చేసింది. అవార్డు స్ఫూర్తిగా మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. పూర్వ విద్యార్థుల సౌజన్యంతో విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగులు, తాగునీటి వసతి కల్పించారు. గతేడాది పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇలా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ సెలవులకే సెలవు పెట్టడంతోపాటు విద్యార్థులు ప్రగతిబాటలో పయనించేలా చర్యలు తీసుకొని శభాష్ అనిపించుకుంటున్నారు.

హమాలీ కార్మికుల మెరుపు సమ్మె



నినాదాలు చేస్తున్న హమాలీ కార్మికులు

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం సిరిసిల్లలో ఒక్క రోజు మెరుపుసమ్మె చేపట్టారు. స్థానిక సివిల్ సప్లయ్ హమాలీ సంఘం గోదాం వద్ద నిరసన తెలిపా రు. అధికారులు వెంటనే తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. సంఘం అధ్యక్షుడు పుప్పాల రాజేశ్, ఉపాధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి శివలింగం, దేవయ్య, నక్క రాములు, రాజయ్య, రాజిరెడ్డి, నూనె వెంకటేశం, భద్రయ్య, పుప్పాల జక్కయ్య, వెంకటేశ్‌చౌదరి, మహేశ్ పాల్గొన్నారు.

ముగ్గులతో నిరసన



సిరిసిల్లటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 23 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు బుధవారం కొత్త సంవత్సరం సందర్భంగా కలెక్టరేట్ ఎదుట ముగ్గులు వేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

- జిల్లా రవాణాధికారి వి.లక్ష్మణ్



మాట్లాడుతున్న డీటీవో లక్ష్మణ్


సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని డీటీవో లక్ష్మణ్ కోరారు. సిరిసిల్లలో బుధవారం ప్రైవేటు వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించక పోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎంవీఐ వంశీధర్ ఏఎంవీఐలు రజనీదేవి, పృథ్వీరాజ్‌వర్మ, కానిస్టేబుల్ రమ్య, సౌమ్య, ప్రశాంత్, హోమ్‌గార్డ్ ఎల్లేశ్, లారీ, కార్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్, డ్రైవర్స్ 100 మంది వరకు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాలు

వేములవాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాలను సిరిసిల్ల ఎంవీఐ వంశీధర్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. డిపో మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉంటేనే ఇల్లు

- 'డబుల్' ఇళ్లలో ఉండని వారికి అధికారుల షాక్
- జిల్లా వ్యాప్తంగా 335 మంది ఉండడం లేదని గుర్తింపు
- జాబితా తయారీలో అధికారులు
- నోటీస్‌లు ఇచ్చేందుకు సిద్ధం
- ఇప్పటికే గ్రామసభల ద్వారా సమాచారం



ఇది ఎల్లారెడ్డిపేట శివారులోని కేసీఆర్‌నగర్‌లో గల డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో తాళం వేసి ఉన్న ఇల్లు. అన్ని అర్హతలు ఉండడంతో అధికారులు ఇంటిని కేటాయించారు. అయితే ఇంటిని తీసుకున్న లబ్ధిదారుడు తాళం వేసి స్థానికంగా ఉండడం లేదు. ఇలాంటి వారు ఈ సముదాయంలో 32 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నివాసం ఉండకుంటే ఇళ్ల యాజమాన్యహక్కులను రద్దు చేస్తామని అధికారులు నోటీస్‌లు జారీ చేశారు. అధికారుల నిర్ణయం లబ్ధిదారులకు షాక్‌గా మారింది. ఇలాంటి పరిస్థితి రాజన్నసిరిసిల్ల జిల్లాలో 385 మంది లబ్ధిదారులు సైతం తమకు కేటాయించిన ఇళ్లలో ఉండడం లేదని అధికారులు వారి తనిఖీల్లో తేల్చారు. అలాంటి వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు.



ఎల్లారెడ్డిపేటలోని కేసీఆర్‌నగర్ కాలనీ

డబుల్ ఇళ్ల సమాచారం

నిధులు	: రూ.189.81 కోట్లు
మంజూరైన ఇళ్లు	: 6,886
పూర్తయిన ఇళ్లు	: 3,653
ప్రారంభంకానివి	: 2,607
లబ్ధిదారులకు అందజేసినవి	: 3,357



ఎల్లారెడ్డిపేటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో విచారణ చేపడుతున్న రెవెన్యూ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేదల సొంతింటి కల నిజం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. గ్రామపంచాయతీల్లో అధికారులు పలుమార్లు గ్రామసభలు నిర్వహించి.. అన్ని అర్హతలు ఉన్న వారినే అర్హులుగా గుర్తించారు. అయితే గ్రామానికి మంజూరైన ఇళ్లు తక్కువగా ఉండడం.. అర్హుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,357 మందికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేశారు. అయితే ఇళ్లు పొందిన వారిలో చాలా మంది స్థానికంగా ఉండడం లేదని ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీ చేయగా నిజమేనని తేలింది. దీంతో స్థానికంగా ఉండని వారి ఓనర్‌షిప్‌ను రద్దు చేసి మరో అర్హుడికి ఇల్లు ఇవ్వాలని గ్రామపంచాయతీల్లో తీర్మానిస్తున్నారు.

మంజూరు 6,886.. పూర్తి 3,653

రాజన్నసిరిసిల్ల జిల్లాకు 6886 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి రూ.189.81 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 3,653 ఇళ్లు పూర్తికాగా 3,357 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. మిగతా 2,607 ఇళ్ల పనులే ప్రారంభంకాలేదు. జిల్లా వ్యాప్తంగా చందుర్తి, రుద్రంగి, వేములవాడరూరల్, ఇల్లంతకుంట మండలాలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో వెనకబడి ఉన్నాయి. వేములవాడఅర్బన్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి మండలాల్లో ఒక్క ఇల్లు కూడా పూర్తికాలేదు.

లబ్ధిదారుల్లో గుబులు

స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పలువురు లబ్ధిదారులు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పొందిన వారందరూ నిరుపేదలే కావడం, స్థానికంగా అందరికీ పనులు లభించక పోవడంతో కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అధికారులు వాపస్ తీసుకుంటామని నిర్ణయించడంపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు సొంతిల్లు ఉందనే భరోసాతో ఇతర ప్రాంతాల్లో బతుకుతున్న వారికి అధికారుల నిర్ణయం గుదిబండగా మారింది. వచ్చిన ఇల్లు పోతే తమకు సొంతూరిలో కనీసం నిల్వ నీడ కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పునరాలోచించాలని కోరుతున్నారు.

ఫిర్యాదులతో తనిఖీలు

- ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేసీఆర్ నగర్‌లో ఇళ్లు పొందిన పలువురు స్థానికంగా ఉండడం లేదని అధికారులకు ఫిర్యాదులు అందాయి. గతంలోనే ముస్తాబాద్‌లో అధికారులు తనిఖీ చేసి 18 మంది స్థానికంగా ఉండడం లేదని గుర్తించారు. వారికి నోటీస్‌లు అందజేయడంతో లబ్ధిదారులు వెంటనే అధికారులను కలిసి స్థానికంగానే ఉంటామని, బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లామని తమ ఇళ్లను రద్దు చేయొద్దని విన్నవించుకున్నారు. దీంతో అధికారులు మొదటి హెచ్చరిక కింద పరిగణిస్తూ వారిని నివాసం ఉండేందుకు అనుమతించారు.
- ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేసీఆర్‌నగర్ కాలనీలో 14 బ్లాకులలో 167 మందికి ఇళ్లు కేటాయించారు. అయితే ఇటీవల అధికారులు చేపట్టిన తనిఖీల్లో 22 మంది స్థానికంగా ఉండడం లేదని, తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. తర్వాత గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభకు రావాల్సిందిగా నోటీస్‌లు అందజేసినా లబ్ధిదారులు హాజరుకాలేదు. ఆ సమావేశంలో అధికారులు నిర్ణయం మేరకు.. తాళం వేసి ఉన్న 22 ఇళ్లను స్వాధీనం చేసుకోవాలని తీర్మానించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 335 మంది తమకు కేటాయించిన ఇళ్లలో ఉండడం లేదని అధికారులు గుర్తించారు. వారందరికీ నోటీస్‌లు అందజేసేందుకు సిద్ధమవుతున్నారు.

నివాసం ఉండాల్సిందే..



"డబుల్ ఇల్లు పొందిన వారు తప్పకుండా స్థానికంగానే నివాసం ఉండాలి. నివాసం ఉండకుండా తాళాలు వేయడం, ఇతరులకు అద్దెకు ఇవ్వడం సరికాదు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించాం. స్థానికంగానే నివాసం ఉండాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించాం. అయినా ఎవరైనా ఉండకపోతే చర్యలు తీసుకుంటాం.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

ఎలుగుబంటి దాడిలో యువకుడికి గాయాలు


గాయపడిన నరేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎలుగుబంటి దాడిలో ఎల్లారెడ్డిపేట మండలంలోని గుట్టపల్లి చెరువు తండాకు చెందిన నరేశ్ గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. నరేశ్ గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం గొర్రెలను మేత కోసం స్థానిక అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం పొదల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి నరేశ్‌పై దాడి చేసింది. ఈ ఘటనలో అతని కుడి చేతికి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో తండావాసులు భయాందోళనకు గురయ్యారు. బాధితుడికి ప్రభుత్వం పరిహారం అందించాలని మాజీ సర్పంచ్ పుణ్యానాయక్ కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి


గట్టుబాబు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఎల్ఎండీ మహాత్మానగర్‌కు చెందిన పొలవేని గట్టుబాబు(61), మంగ(55), మాడిశెట్టి అశోక్, అహల్య గత నెల 26న వేములవాడలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి కారులో వెళ్లారు. అదేరోజు తిరిగి వస్తుండగా వీరి కారు బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి శివారులో రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంగ అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో గట్టుబాబును కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆయన అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి శ్రీవేణుగోపాలస్వామి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగురు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మర్రి వెంకట్‌రెడ్డి, క్యాషియర్‌గా గుర్రాల చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శిగా మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులుగా నిమ్మతుల అంజిరెడ్డి, పాశం నారాయణరెడ్డి, వంగల హనుమంతరెడ్డి, గుర్రాల దేవారెడ్డి, గుర్రాల సత్యరెడ్డి, పెండ్యాల వెంకటరెడ్డి, శాతాని రామ్‌రెడ్డి, బైరి రాజిరెడ్డి, పొన్నాల రవీందర్‌రెడ్డి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పట్టణంలోని శ్రీశివభక్తాంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఉమ్మెంతుల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గత మంగళవారం రాత్రి తాళం వేసి వెళ్లిన పూజారి బుధవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగిలి కనిపించింది. చైర్మన్ పరిశీలించి పంచలోహ హన్‌మాన్ విగ్రహం, ఇత్తడి తాంబాళం, ఇత్తడి గోముఖాలు, ఆంప్లిఫయర్ తోపాటు హుండీలోని డబ్బులు చోరీ అయ్యాయని పేర్కొన్నారు.

అమ్మిందే మాంసం !

- సిరిసిల్లలో వ్యాపారుల వింత పోకడ
- పదిహేడేళ్లుగా స్లాటర్‌హౌస్ లేదు
- అధికారులకు పట్టింపు లేదు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో వ్యాపారులు అమ్మిందే మాంసంగా మారింది. నాణ్యత గల మాంసం విక్రయించడం లేదు. అయినా సిరిసిల్ల బల్దియా అధికారులు ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. వెటర్నరీ అధికారులు పరీక్షించి, సీల్ వేసిన తర్వాతనే మాంసాన్ని విక్రయించాల్సి ఉంటుంది. కానీ జిల్లా కేంద్రంలో ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు. ఫలితంగా పట్టణ ప్రజలు ఏది మంచి మాంసమో.. ఏది కాదో తెలుసుకోలేకపోతున్నారు. గత్యంతరం లేక వ్యాపారులు ఇచ్చిందే మాంసంగా తీసుకుంటున్నారు. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం.


సిరిసిల్లలో నాణ్యత గుర్తించని మాంసం అమ్మకాలు

కనిపించని మున్సిపల్ మార్క్

సిరిసిల్ల పట్టణంలో గొర్రె, మేక మాంసం విక్రయాల్లో వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. దశాబ్దంన్నరకు పైగా సాగుతున్న తంతుకు పాలకులు స్వస్తి పలకడం లేదు. తరచూ స్లాటర్‌హౌస్ ప్రారంభిస్తామంటూ హడావిడి చేసి తర్వాత మిన్నకుండడం సిరిసిల్ల బల్దియాకు అలవాటైపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. నిజానికైతే మున్సిపాలిటీల్లో మాంసం విక్రయాలపై అధికారులు నిబంధనల ప్రకారం అమ్మకాలపై పర్యవేక్షణ చేయాలి. వ్యాపారీ గొర్రెను లేదా మేకను కోసేముందు వెటర్నరీ(పశువైద్యుడు) పరీక్షించి దాని నాణ్యతను గుర్తించాల్సి ఉంటుంది. తదుపరి మున్సిపల్ సంబంధిత అధికారి కార్యాలయం సిబ్బంది సీల్ వేస్తారు. ఆ తర్వాతే వ్యాపారులు దుకాణాలకు మాంసం తరలించి విక్రయించాలి. ప్రతిరోజు క్వింటాళ్ల కొద్దీ మాంసం విక్రయాలు జరుగుతాయి. ఇక ఆదివారం సాధారణ రోజులతో పోల్చితే పదింతలు ఎక్కువగా ఉంటుంది.

స్లాటర్‌హౌస్ కథా ఏమైనట్లో..

గ్రామపంచాయతీ హయాంలోనే సిరిసిల్లలో స్లాటర్‌హౌస్ ఉండేది. ప్రస్తుతం జిల్లా పోలీస్(ఎస్పీ) ఆఫీస్ పక్కన ఇప్పుడు మున్సిపల్ వారు నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ స్థానంలో ఉండేది. మార్కెట్‌లో కూడా ప్రత్యేకంగా మాంసం అమ్మకాల కోసం నిర్మించిన దుకాణ సముదాయం ఉండేది. 17 క్రితం వీటిని అప్పటి కౌన్సిల్ అనుమతిలో కూల్చేశారు. పట్టణ శివారులోని మున్సిపల్ లేఅవుట్ స్థలాన్ని స్లాటర్‌హౌస్‌కు కేటాయించారు. దాని టెండర్లు పూర్తవగా కాంట్రాక్టర్ నిర్ణీత సమయానికి నిర్మించి ఇవ్వలేదు. అప్పటి నుంచి సిరిసిల్లలో స్లాటర్‌హౌస్ లేదు. మున్సిపల్ వారు స్లాటర్‌హౌస్‌కు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తర్వాత స్లాటర్‌హౌస్ కోసం మున్సిపల్ అధికారులు మానేరునది ఒడ్డున స్థలం కేటాయించినా నిర్మాణానికి నోచుకోలేదు. చివరికి ఎనిమిదేళ్ల క్రితం కార్గిల్‌లేక్ చెరువుపక్కనే మున్సిపల్‌కు చెందిన రెండు గుంటల స్థలాన్ని కేటాయించి రూ.5లక్షలు వెచ్చించి తాత్కాలికంగా షెడ్డును నిర్మించారు. దాన్ని ఇప్పటి వరకు ప్రారంభించలేదు.


కార్గిల్‌లేక్ పక్కన నిరుపయోగంగా స్లాటర్‌హౌస్

త్వరలోనే స్లాటర్‌హౌస్ ప్రారంభిస్తాం



పదిహేను రోజుల్లో కార్గిల్‌లేక్ వద్ద గల స్లాటర్‌హౌస్‌ను ప్రారంభిస్తాం. మాంసం విక్రయాలు, జీవాల వధపై వ్యాపారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇక రైతుబజారు పక్కనే ఇంటిగ్రేటెడ్ స్లాటర్ హౌస్ నిర్మాణం అంశం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం. ప్రజలకు నాణమైన మాంసం అందించడానికి కృషి చేస్తాం.

– దుబ్బాక లావణ్య, మున్సిపల్ కమిషనర్

ఆర్ఎంపీపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

- చందుర్తిలో సంఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని ఓ ఆర్ఎంపీ వైద్యునిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వడ్డీవ్యాపారులపై ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టడాన్ని తీవ్రంగా పరిగణించిన సదరు వ్యక్తులు దాడికి దిగినట్లు ప్రచారంలో ఉంది. గాయపడ్డ వైద్యుడు రెండు రోజులపాటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఠాణాకు కూతవేటు దూరంలో ఉన్న మండలకేంద్రంలో దాడికి దిగడం చర్చనీయాంశమైంది. అంతేకాకుండా కొట్టిన విషయాన్ని ఎవరికైనా చెబితే ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని హెచ్చరించడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితుడు జంకుతున్నట్లు చర్చ సాగుతోంది.

ఆర్ఎంపీ కోసం పోలీసుల గాలింపు

దాడి విషయం ఆలస్యంగా తెలియడంతో పోలీసులు బాధితుడైన ఆర్ఎంపీ కోసం గాలిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాడి చేసిన వారం రోజుల తర్వాత విషయం బయటకు పొక్కడంతో పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నట్లు తెలిసింది. సంఘటన పూర్వాపరాలను తెలుసుకునేందుకు సీఐ, ఎస్సైలు వేర్వేరుగా అతను అద్దెకు ఉంటున్న ఇంటికి వెళ్లి వచ్చినట్లు సమాచారం. ఈ విషయమై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. దాడి సంఘటనపై ఆరా తీస్తున్నామని, ఆర్ఎంపీ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో పూర్తి సమాచారం సేకరించలేకపోయినట్లు తెలిపారు. ఆర్ఎంపీని విచారిస్తేనే అసలు విషయం తెలుస్తుందని స్పష్టం చేశారు.

బ్రిటీష్ వరల్డ్ రికార్డుల్లో కందేపి


కందేపి రాణిప్రసాద్

సిరిసిల్లటౌన్: బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్‌కు బ్రిటీష్ వరల్డ్ రికార్డుల్లో చోటు లభించింది. సిరిసిల్లలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మానవ శరీర అవయవాలు, బాల సాహిత్యం, ఆస్పత్రి పరికరాల తయారీ, వ్యర్థాలతో అందమైన ఆకృతుల తయారీ తదితర అంశాలతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నందుకు ఈ గౌరవం తనకు దక్కిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

దాడి సంఘటనలో ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఒకరిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చగా.. బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండల కేంద్రంలోని వడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి పరశురాములు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం అర్ధరాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో డీజే సౌండ్ పెట్టి డాన్సులు చేస్తున్నారు. శివరాత్రి నరేశ్, అతని తండ్రి రాజు కలిసి దాడి చేశారు. ఈ దాడిలో పరశురాములు తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పరుశురాం

సిరిసిల్లటౌన్: బీసీలకు విద్య, రాజకీయం, ఉపాధిరంగాల్లో జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరుశురాం డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాల్లో సముచితస్థానం కల్పించాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాలతో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా నాగరం కొమురవ్వ, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కని త్రివేణి, జిల్లా సెక్రెటరీగా మచ్చ అనసూర్య, బండారి రేవతి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షురాలిగా కోడెం రవి, ప్రధాన కార్యదర్శిగా సంధవేని శ్రీనివాస్‌లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వారికి నియామక పత్రాలు అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బిల్లా వెంకట్‌రాములు, జిల్లా అధికార ప్రతినిధి, కోరుట్ల రమేశ్, జిల్లా కార్యదర్శి ఎడ్ల నరేందర్, సిలువేని మల్లేశం, రుద్రంగి మండల అధ్యక్షుడు మీసాల మల్లేశ్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ఎగురుల కరుణాకర్, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు తీగల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాములు, కార్యదర్శి చిగుర్ల పరుశురాం తదితరులు పాల్గొన్నారు.


మహిళా విభాగం కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న పరుశురాం

బైక్ చెట్టుకు ఢీకొని మైనర్ దుర్మరణం


హరినాథ్ (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): మిత్రులందరూ కలిసి కొత్త సంవత్సరం 2025కు స్వాగతం పలికేందుకు ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు. అర్ధరాత్రి వరకూ ఘనంగా సంబురాలు చేసుకున్నారు. ఆ తర్వాత టీ తాగేందుకు బుధవారం వేకువజామున బైక్‌పై టీకొట్టుకు వెళ్తున్నారు. అతివేగానికి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో నెరువట్ల హరినాథ్ (15) దుర్మరణం చెందాడు. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ సమీపంలో రాజీవ్ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. బసంత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నెరువట్ల తిరుపతి – శ్రీలత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు హరినాథ్ బసంత్‌నగర్ ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మిత్రులతో కలిసి మంగళవారం అర్ధరాత్రి వరకూ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నాడు. తెల్లవారుజామున బసంత్‌నగర్ నుంచి కన్నాల టోల్‌ప్లాజా వెళ్లేందుకు యమహా బైక్‌పై హరినాథ్, మరో బైక్‌పై ఇంకో ముగ్గురు మిత్రులు బయలు దేరారు. మార్గమధ్యలో పాత బ్రాందీషాపు దాటిన తర్వాత గల మూలమలుపు వద్ద హరినాథ్ బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో బాలుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మరణించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నూతన సంవత్సరం రోజే రోడ్డు ప్రమాదం జరగడంతో ఆ ఇంట్లో విషాదం అలముకుంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..


రిషిత్‌రెడ్డి మృతదేహం

ఇల్లంతకుంట(మానకొండూర్): రోడ్డు ప్రమాదంలో ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామానికి చెందిన ఈదులకంటి రిషిత్‌రెడ్డి(20) మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదులకంటి మహేందర్ రెడ్డి–చైతన్య దంపతుల కుమారుడు రిషిత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తన స్నేహితుడితో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ పోయిస్తుండగా రిషిత్‌రెడ్డి రోడ్డు పక్కన నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రిషిత్‌రెడ్డి మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం

మల్లాపూర్(కోరుట్ల): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలి పారు. ఆయన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటకు చెందిన తోకల తాతయ్య(58)కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొడుకులకు వివాహాలయ్యాయి. కొంతకాలంగా తాతయ్య మద్యానికి బానిసవడంతో భార్య, కుమారులు తరచూ మందలిస్తున్నారు. అతను మద్యం సేవించడాన్ని మానలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు.

బీసీల రిజర్వేషన్లపై అపోహలు తొలగించాలి


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు

సిరిసిల్లటౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అపోహలు తొలగించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బుధవారం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన మల్లేశ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి బీసీల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ పేరిట కామారెడ్డిలో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. దీనికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేసిందన్నారు. దేశవ్యాప్త జనగణనలో భాగంగా కులగణన కూడా చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింప చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇటీవల బీసీ నినాదం, ఉద్యమం పేరిట హల్‌చల్ చేస్తుందని, ఆమె నాయకత్వం బీసీలకు అక్కర్లేదన్నారు. జిల్లాలో సంఘం బలోపేతంలో భాగంగా జిల్లా కమిటీ సలహాదారుడిగా తోట్ల రాములుయాదవ్, సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడిగా బచ్చు ప్రసాద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన మల్లేశ్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, నాయకులు తోట్ల రాములుయాదవ్, బచ్చు ప్రసాద్, తిరుపతి, నల్ల శ్రీకాంత్, కొండా విజయ్, బోయిని శ్రీనివాస్, తడక శశికుమార్, శ్రీధర్, మల్లేశం పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

- స్విమ్మింగ్‌లో 2 పతకాలు సొంతం చేసుకున్న అనితాశ్రీ
- పలువురు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు కూడా..

కరీంనగర్ స్పోర్ట్స్: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా పతకాలతో శుభారంభం చేశారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, కోశాధికారి సిద్దారెడ్డి, పలు క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.


తండ్రి శ్రీధర్‌తో అనితాశ్రీ

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు చెందిన అనితాశ్రీ బంగారు, రజత పతకాలు సాధించింది. మంగళవారం జరిగిన 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, బుధవారం జరిగిన 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం గెలిచింది.


కోచ్ ప్రవీణ్‌కుమార్‌తో తేజశ్విని

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కరీంనగర్‌కు చెందిన బి.తేజశ్విని సత్తా చాటింది. అండర్–7 విభాగంలో 52 కేజీలలోపు కేటగిరీలో పాల్గొన్న ఆమె రజత పతకం కైవసం చేసుకుంది.


కోచ్, మేనేజర్ కొమురయ్య, జావీద్‌లతో శ్రీనాథ్

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పెద్దపెల్లి జిల్లా అంతర్గాంకు చెందిన జె.శ్రీనాథ్ షాట్‌పుట్ 10.74 మీటర్లు విసిరాడు. రాష్ట్రస్థాయి మూడో స్థానం సాధించి, కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు.


సిరిచందన


కోచ్ రేణుకతో శశిరేఖ

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన క్రీడాకారిణి బంగారు పతకం సాధించింది. 52 కేజీలలోపు విభాగంలో పోటీపడిన టి.సిరిచందన మొత్తం 347.5 కేజీల బరువు ఎత్తి, రికార్డు సృష్టించింది. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శశిరేఖ సత్తా చాటింది. 57 కేజీలలోపు విభాగంలో పోటీ పడిన ఆమె మొత్తం 130 కేజీల బరువు ఎత్తి, కాంస్య పతకం సాధించింది. డీవైఎస్‌వో సురేశ్, కోచ్‌లు కొమురయ్య, రేణుక, మేనేజర్లు జావీద్, ఖాజా హర్షం వ్యక్తం చేశారు.


కోచ్, మేనేజర్లతో దీపక్, అశ్విత్, హర్షిత్, రంజిత్

హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. 10 నుంచి 14 సంవత్సరాలలోపు ట్రెడిషనల్ యోగాసన పోటీల్లో మానకొండూర్ గురుకుల పాఠశాలకు చెందిన పురాణం దీపక్ బంగారు, ఆర్టిస్ట్ యోగాలో అశ్విత్, రిథమిక్ యోగాలో హర్షిత్ బాలాజీలు రజత పతకాలు సాధించగా, 14 నుంచి 16 సంవత్సరాలలోపు బాలుర ట్రెడిషనల్ యోగాలో రంజిత్ కాంస్య పతకం సాధించాడు. డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, కోచ్, మేనేజర్లు ప్రవీణ్‌కుమార్, జి.రామకృష్ణ, ఆనంద్ కిశోర్, మల్లీశ్వరి హర్షం వ్యక్తం చేశారు.

రెప్పపాటులో ప్రమాదం

- ఒకరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం
- సిరిసిల్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తుండగా వాహనం బోల్తా


కాంత మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): కొత్త సంవత్సరం వేళ వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తున్న వాహనం బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, 19 మంది గాయపడ్డారు.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వెలుగూర్‌కు చెందిన 27 మంది కూలీలు వ్యవసాయ పనుల కోసం కొద్ది రోజుల క్రితం కరీంనగర్ జిల్లా కేంద్రం సమీపంలోని అలుగునూర్‌కు వచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా వేములవాడ రాజన్న దర్శనానికి టాటా ఏస్ గూడ్స్ వాహనంలో బుధవారం 20 మంది బయలుదేరారు. బోయినపల్లి మండలం కొదురుపాక జంక్షన్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కాంత, కవిత, సమంతబాన్, లక్ష్మి, సూర్య, రాజు, అంబేడ్కర్, రేఖ, కవిత, సుష్మ, ఛాయ, వసంత తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కాంతను కరీంనగర్ తరలించగా మృతిచెందగా, కవిత, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. గంగుభాయి, విమల, మమత, సుధాకర్, తానాజీ, బిక్కు, శంకర్, వనిత గాయపడ్డారు. వీరిని 108 వాహనాలలో మొదట వేములవాడకు, అక్కడి నుంచి సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు అందరూ 35 నుంచి 40 ఏళ్ల వయస్సు మధ్య వారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. డ్రైవర్ మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ తెలిపారు.


సిరిసిల్ల ఆస్పత్రిలో క్షతగాత్రులు


రాజరాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సందడి


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి



విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్..

ఎములాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ: కొత్త సంవత్సరం సందర్భంగా బుధవారం ఎములాడకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 25 వేల మంది రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కు చెల్లించడంతోపాటు అనుబంధ దేవాలయాలను దర్శించుకున్నారు.

రాజన్న సేవలో విప్‌లు, ఎస్పీ

రాజన్నను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. నాయకులు శ్రీనివాస్, తిరుపతిరావు, శ్రవణ్ తదితరులున్నారు. రాజన్నను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్పీ అఖిల్ మహాజన్ దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి వారికి స్వామి వారి ప్రసాదాలు అందించి, సత్కరించారు. ఏఈవో శ్రవణ్, అర్చకులున్నారు.


కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

అర్చకుల అంతర్గత బదిలీలు?

వేములవాడ రాజన్న ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల అర్చకుల అంతర్గత బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నట్లు సమాచారం.